ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



# రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న బ్యాంకర్లు



**ఉద్యమ కెరటం, జైనూర్:** రుణాల కోసం బ్యాంక్ అధికారులు రైతులను బ్యాంకుల చుట్టూ తిప్పుకుంటున్నారని ఆదివాసీ హక్కుల పోరాటసమితి (తుడుందెబ్బ) మండల అధ్యక్షులు మధురాజ్ మడావి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి మాట్లాడారు. మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ బ్రాంచ్‌లో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. రబీ సీజన్ ప్రారంభమై నెలలు గడుస్తున్నా మండల రైతులకు బ్యాంకు ద్వారా క్రాప్ లోన్లు ఇప్పటివరకు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు అన్ని అర్హతలు కలిగి ఉన్నప్పటికీ అధికారులు కావాలనే ఆలస్యం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు విత్తనాలు, ఎరువులు కొనలేని పరిస్థితి ఏర్పడిందని, అప్పుల పాలై తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన ఆర్థిక సహాయం లేకపోవడం, బ్యాంకులు సహకరించకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. కొందరు రైతులు ఆత్మహత్య ప్రయత్నాలకు దిగే పరిస్థితి ఏర్పడటం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. దీనికి ప్రభుత్వంతో పాటు సంబంధిత బ్యాంక్ అధికారులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి రైతుకు క్రాప్ లోన్లు, పెండింగ్ లోన్లు వెంటనే మంజూరు చేయాలని, కావాలనే నిర్లక్ష్యం చేస్తున్న ఎస్‌బీఐ అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, జైనూర్ మండల రైతులకు ప్రత్యేకంగా రబీ సీజన్ లోన్ క్యాంప్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని, లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఆత్రం అర్జున్, నాయకులు ఆత్రం మోతిరాం, మెస్రం గణేష్, కుర్సెంగ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

**జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజార్షిషా**




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మున్సిపల్ ఎన్నికల విధుల్లో అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం అలసత్వం వహించినా సహించబోమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజార్షిషా హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆదిలాబాద్ మున్సిపాలిటీకి జరగనున్న రెండవ సాధారణ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో గురువారం జెడ్పీ కాన్ఫరెన్స్ హాల్‌లో మైక్రో అబ్జర్వర్లు, జోనల్ అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్లు, జోనల్ అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రతి అధికారి ఎన్నికల నియమావళిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ కేంద్రాల్లో తలెత్తే సమస్యలను తక్షణమే పరిష్కరించేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికలు పారదర్శకంగా, నిస్పక్షపాతంగా నిర్వహించడమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఎన్నికల పరిశీలకులు హనుమంతు నాయక్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే అధికారులు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ నివేదికలు అందజేయాలని అన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్ ఎన్నికల నియమావళి, ఈవీఎంల నిర్వహణ, పోలింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ జి రాజు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



## ఇంటింటా ఎన్నికల ప్రచారం

**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 7వ వార్డు సంజీవయ్య కాలనీలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్‌ప్రవీణ్ కుమార్ బలపర్చిన కౌన్సిలర్ అభ్యర్థి నక్క జ్యోతి మనోహర్ స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు హామీలు ఇస్తూ, రాబోయే ఎన్నికల్లో తమకు, మద్దతు ఇవ్వాలని కోరారు. తాగునీటి సరఫరా, డ్రైనేజ్ సౌకర్యాలు, వీధిదీపాల ఏర్పాటు వంటి మౌలిక వసతులను ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు శోభన్, వెంకటేష్, సాయికృష్ణ, శివ, రాజేష్, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## ఉపాధిహామీతో వలసల నియంత్రణ



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** ఉపాధి హామీ పథకంతో వలస కూలీలను నియంత్రించవచ్చని సర్పంచ్ బుజాడి అనసూయ సుధాకర్ అన్నారు. మండలంలోని పాపన్నపేట గ్రామంలో గురువారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలకు పని కల్పించే అవకాశం లభించడంతో పాటు రైతులకు అవసరమయ్యే పనులను ఉపాధి హామీలో చేయించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దన్నూరి శ్రీకాంత్, పాలకవర్గం వార్డు సభ్యులు, ఉపాధి హామీ కూలీలు, గ్రామపంచాయతీ, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదరించండి.. అభివృద్ధి చేస్తా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని ఆదిలాబాద్ పట్టణంలోని 21వ వార్డు క్రాంతి నగర్, తిలక్ నగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఓసావర్ వెంకటి కోరారు. గురువారం కాలనీలో గడప గడపకు తిరుగుతూ ఎన్నకల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనను గెలిపిస్తే సాధ్యమవుతుందని తెలిపారు. ప్రధాన సమస్యలైన కమిటీ హాల్, విఠల రుక్మిణి ఆలయ అభివృద్ధి, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్త, విశ్వ బ్రాహ్మణుల ఆరాధ్య దైవం బ్రహ్మం ఆలయ నిర్మాణం, రోడ్లు, హైమాక్స్ లైట్లు, ప్రతి ఇంటికి మంచి నీటి సౌకర్యం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి తీరుతానని పేర్కొన్నారు.

## పాఠశాలల అభివృద్ధికి కృషి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** గ్రామీణ ప్రాంతాల పాఠశాలలు మరింత అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండలంలోని కిష్టాపూర్ గ్రామ పంచాయతీలోని శంకరాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి స్థానిక సర్పంచ్ జితేందర్ సింగ్ సోలంకితో కలిసి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దర్బార్, గ్రామ నాయక్ లక్ష్మణ్, రోల్ మామడ సర్పంచ్ తొడసం శంకర్, యాపాల్ గూడ సర్పంచ్ మండాడి కృష్ణ, దర్భతండా సర్పంచ్ ఆడే సీతారాం, నక్కల్వాడ సర్పంచ్ నవీన్ కుమార్, మర్లపల్లీ ఉప సర్పంచ్ రమేష్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ తిత్రే నారాయణ్ సింగ్, మాజీ ఎంపీటీసీ చట్ల ఉమేష్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ అబ్రార్, యువ నాయకులు అచ్యుతానంద రెడ్డి, ఎండి సద్దాం, ఖాజా, సీనియర్ నాయకులు బొజ్జ సాయన్న, మహమ్మద్, సన్నీ రెడ్డి, బుక రాములు, రమేష్, జాదవ్ వసంత్ రావు, సోలంకి మహిపాల్, ఈశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి

**ఉద్యమ కెరటం, తిర్యాణి:** మారుమూల గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నైతం రామచందర్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మారుమూల గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా ముందుగానే ప్రణాళికలు రూపొందించి చర్యలు తీసుకోవాలని అన్నారు. వేసవిలో తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉంటాయని, ముందస్తు ఏర్పాట్లతో సమస్యలను నివారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించి, ఇళ్ల నిర్మాణంలో పారదర్శకత, నాణ్యత తప్పనిసరిగా పాటించేలా చూడాలని సూచించారు. అట్టడుగు వర్గాలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అర్హులైన పేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, మండల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేముల హేమలత, కాంగ్రెస్ పార్టీ నాయకులు అంకం గౌరయ్య, కూన సురేష్, కురిసెంగా శోభన్, మేడిశెట్టి చందు, నల్లూరి రాజు, బొల్లం మల్లేష్, బొల్లం రాజు, తట్ల చిన్నయ్య, దాసరి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల నుంచి ప్రజలను రక్షించాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** వీధి కుక్కల నుంచి ప్రజలను రక్షించాలని కోరుతూ కిష్టంపేట గ్రామ సభలో పలువురు ప్రజలు కిష్టంపేట గ్రామపంచాయతీ కార్యదర్శి ఉదయ్ రాంప్రసాద్‌కు వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిష్టంపేట గ్రామపంచాయతీ పరిధిలో ని రెండవ వార్డులో గత కొన్ని రోజులుగా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను గాయాలపాలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత గ్రామపంచాయతీ అధికారులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో స్పందించి వీధి కుక్కలను నియంత్రించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిష్టంపేట గ్రామపంచాయతీ రెండవ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు సీఎం కప్ క్రీడా పోటీలు

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** సీఎం కప్ పోటీల్లో భాగంగా ఈనెల 6, 7 తేదీల్లో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడా సేవల అధికారి గుర్రాల హనుమంత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 6న చెన్నూర్ నియోజకవర్గంలో మినీ క్రీడా మైదానంలో, బెల్లంపల్లి నియోజకవర్గంలో ప్రధా నమంత్రి టీజీఆర్ జేసీఉతాళ్లగురజాల ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈనెల 7న మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాధికార సంస్థ మైదానంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, యోగా, చెస్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, కరాటే తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు తమ నమోదు స్లిప్‌తో పాటు అసలు ఆధార్ కార్డు తీసుకుని సకాలంలో హాజరుకావాలని సూచించారు. ఆలస్యంగా వచ్చే క్రీడాకారులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా బోరంచు ప్రచారం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 41వ వార్డు సాయినగర్, టీచర్స్ కాలనీ, 40వ వార్డు దస్నాపూర్, వార్డు 10 రామ్ నగర్ లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా గురువారం తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. గడప గడప కు వెళ్లి చేతి గుర్తుకు ఓటు వేసి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. వార్డులలో అన్ని మౌలిక సదుపాయాలు కావాలన్నా, పట్టణం అభివృద్ధి చెందాలన్నా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డులు, సన్నబియ్యం లాంటి ఎన్నో పథకాలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు ప్లాస్టిక్ క్రేట్స్ పంపిణీ



**ఉద్యమ కెరటం, తాండూర్:** ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కూరగాయలు సాగు చేసే రైతులకు కూరగాయల రవాణా సౌకర్యం కోసం 50 శాతం సబ్సిడీపై ప్లాస్టిక్ క్రేట్స్ అందజేస్తున్నట్లు బెల్లంపల్లి ఉద్యానవన అధికారి అర్చన ఒక ప్రకటనలో తెలిపారు. ఒక రైతుకు గరిష్టంగా 40 ప్లాస్టిక్ క్రేట్స్ మాత్రమే అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఒక్క ప్లాస్టిక్ క్రేట్ అసలు ధర రూ.337 కాగా, 50శాతం సబ్సిడీతో రైతులకు ఒక్క క్రేట్‌ను రూ.168.50 కు అందిస్తామని తెలిపారు. ఈ లెక్కన 40 ప్లాస్టిక్ క్రేట్స్‌కు రైతులు కేవలం రూ.6,740 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఇతర వివరాల కోసం ఉద్యాన శాఖాధికారి బెల్లంపల్లి కార్యాలయాన్ని, సెల్ నం. 8977713955పై సంప్రదించాలని సూచించారు.

